
కథ

‘అప్పుడు నా వయస్సు పదేళ్లు. బడిలో గోడల మీద ‘పెద్దలను గౌరవించుము’ అన్న వాక్యం చదివినప్పుడు, నా కెన్నో సందేహాలు కలుగుతూ ఉండేవి. పెద్ద వాళ్ళంటే ఎవరు? దీనికి సమాధానంగా, చాలా మంది, పెద్ద వాళ్ళంటే, వయ సులో నీ కంటే పెద్ద వాళ్లు, అని చెబుతుండే వారు.



# పెద్దవాళ్ళు

సాయికృష్ణ

చాలా కొద్ది మంది మాత్రం బుద్ధిలో పెద్దయిన వాళ్లని పెద్ద వాళ్ళంటారు, వయసులో కాదు, అని చెప్పేవారు. ఆ తర్కం నా కర్థమయ్యేది కాదు. అందుకని, ఎక్కువ మంది చెప్పినట్టు, వయసులో పెద్దయిన వారే పెద్దవాళ్లని అనుకునేవాడిని.

మా వూళ్ళో కాంతయ్యని ఒక పోరంబోకుండేవాడు. పెద్దవాళ్లంతా ఆయనని పోరంబోకనేవాళ్ళు. పోరంబోకంటే ఏవిటో అప్పుడు నాకు తెలియదు. విన్నదాన్ని బట్టి అతడి పేకాడుతూనో లేక ఊరి బయట కల్లుపాకలో కల్లుతాగుతూనో కాలం గడిపేవాడు. ఇంట్లో వాళ్లని పట్టించుకునే వాడు కాదు. ఒక రోజున, ఊరి మధ్యనున్న మర్రి చెట్టు కింద పది మంది పెద్దవాళ్ళు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో పోరంబోకు గారు అటు వెళ్తూ నాకెదురువడ్డారు.

“మీరు పెద్దవారు, నమస్కారం” అన్నా చేతులు జోడించి, వెంటనే చెట్టు కింద పెద్దవాళ్లంతా పగలబడి నవ్వేరు. కారణం ఏమిటాని తెలుసుకునే లోపునే పోరంబోకుగారు నా దవడవగలగొట్టి, చెట్టు కింద వారికేసీ, నాకేసీ కొరకొరా చూస్తూ విసురుగా వెళ్లిపోయాడు. వయసులో పెద్దవాడని దండం పెడితే, ఇలా అయిందేవిటాని దవడమీద రాసుకుంటూ వెళ్ళిపోయాను.

ఇంకో రోజున, ఇంకా విచిత్రమైన సంఘటన జరిగింది. ఆ రోజున బాగా ఎండగా ఉంది. బయట జన సంచారం అంతగాలేదు. మా ఇంట్లో అంతా భోజనాలు పూర్తి చేసి నిద్దరోతున్నారు. నాకు నిద్ర పట్టలేదు. ఎండలో బయట తిరిగితే ఇంట్లో కేకలేస్తారని, వూరికే కళ్లు మూసుకుని పడుకున్నాను. దొడ్లో అలికిడయింది. మా ఇంట్లో అద్దెకున్న సుబ్బారావు గారి పిల్లలేమో, వాళ్లతో ఆడుకోవచ్చని, మెల్లిగా లేచి, పిల్లిలా నడుచుకుంటూ దొడ్లోకెళ్లాను. అక్కడ పిల్లలెవరూ లేరు. మా ఇంట్లో అద్దెకుండే సుబ్బారావుగారు మా పక్కంటి సుబ్బలక్ష్మిని కావలించుకుని, ముఖంలో ముఖం పెట్టి ఏవిటో చెబుతున్నాడు. నన్ను చూడగానే విడిపోయి, ఎవరింట్లోకి వాళ్ళు ఇంచుమించుగా పరుగెత్తుకుపోయారు. అదంతా నాకర్థమవలేదు. వెంటనే వాకిట్లో గోడమీద ‘సుబ్బారావంకుల్, సుబ్బలక్ష్మి ఆంటీ ఎంతో పెద్దవాళ్ళు. అంకుల్ ఆంటీని కౌగలించుకున్నాడు అని రాశా

ను. ఎందుకు రాశానా అని తర్వాత విచారించాను. నానెత్తిమీద ఏదయ్యేమో కూర్చుని అలా రాయించిందేమో! ఆ మర్నాడెవరో చూసి, మా ఇంట్లో వాళ్ళకీ, సుబ్బారావుగారింట్లో వాళ్ళకీ ఒకేసారి చెప్పారు. రాతనిబట్టి నేనే రాశానని వాళ్ళకి తెలిసిపోయింది. "పెద్దవాళ్ళని గురించి, వెధవ రాతలు రాస్తావురా! వెధవా! వాళ్ళిద్దరూ ఎంత మంచివాళ్ళు! కళ్ళు పేలిపోతాయ్‌రా!" అంటూ మా ఇంట్లో ఒకరు ఒకటంటించారు.

"చూశాను కాబట్టి రాశాను." అన్నాను ఏడుస్తూ.

"అబద్ధాలు రాయడం కూడా నేర్చుకున్నావా! చేతులూ కాళ్ళూ విరగ్గొడితే కానీ నీకు బుద్ధి రాదు" అంటూ ఇంట్లో కీడ్చుకుపోయారు.

"చూశారా! చూశారా! సుబ్బలక్ష్మి నాకు చెల్లెల్లాంటిది. ఎలా రాశాడో! అన్నాడు సుబ్బారావంకుల్, నాకేసి కోపంగా చూస్తూ, ఎక్కడేనా వంటరిగా కనిపిస్తే, తంతాడేమోనని భయం పట్టుకుంది.

ఆ రోజున మా ఇంట్లో క్రికెట్ ఆట జరిగింది. పెద్దవాళ్లు ఆరుగురు బౌలర్స్. నేను ఒంటరి బ్యాట్స్‌మాన్. కఱ్ఱ తీసుకుని ఒకరు పది దెబ్బలు కొట్టి అలిసిపోతే, ఇంకొకరు ఆ కఱ్ఱ తీసుకుని ఇంకో పది దెబ్బలు కొట్టడం. ఆ విధంగా మెట్రిక్ సిస్టమ్‌లో కొట్టారు నన్ను. అంతా పెద్దవాళ్ళే మరి!

ఆలా ఎదురు దెబ్బలు తింటూ ఇంటర్ పూర్తి చేశాను. నా స్నేహితులంతా "ఒరేయ్! నువ్వు ముక్కుసూటిగా పోయేరకం. అవసరమయితే, పెద్దవాళ్లని కూడా, పెద్ద వాళ్ళు కారని భావించాలి, అలాగే, పెద్ద వాళ్ళు కాని వాళ్లని పెద్దవాళ్లుగా భావించాలి. అదే లౌక్యం. నీకు లౌక్యం తెలీదు. ఎలా బతుకుతావో ఏమో!" అన్నారు.

ఇప్పుడు, పెద్ద వాళ్ళని గురించి నాకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. 'పెద్దవాళ్ళంటే, బుద్ధిలో పెద్ద వాళ్ళు, వయసులో కాదు ' అనే అభిప్రాయం నాకు నచ్చింది. నా కాశ్చర్యం కలిగించే విషయం ఏవిటంటే, కొందరు, బుద్ధిలో పెద్ద కాని వారిని గౌరవిస్తున్నారు. బుద్ధిలో పెద్దయిన వారిని గౌరవించటం లేదు. నా విషయంలో ఇదే జరిగింది.

'పెద్దవాళ్ళు', 'చిన్నవాళ్లు' అంటూ తర్కించుకుంటూ కూర్చుంటే పొట్టనిండదు గదా! మంచిరోజు చూసుకుని మిలటరీలో చేరాను. అక్కడ జీవితం బాగానే ఉంది. దేశమంతా తిరిగాను. పెళ్లి చేసుకున్నాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. రిటైరయి మా వూరికొచ్చాను. నెత్తి మీదొక గూడేర్పాటు చేసుకున్నాను. ప్రభుత్వం నెల నెలా పెన్షన్ ఇస్తోంది. ఇంతవరకూ బాగానే ఉంది ఇప్పటి నుంచే ప్రారంభమయ్యాయి నా తిప్పలు. ఇల మానాన్న నేను పడి ఉండటం, బంధువులు చూస్తు వూరుకోలేకపోయారు. పీడింపు మొదలయింది. కొన్ని సంవత్సరాల క్రితం, చుండూరు దళితవర్గం వారెలా బాధపడ్డారో, అలా బాధపడ్డాను. బంధువుల్లో అంతా అర్థబలం, అంగబలం ఉన్నవారే. నేనే తక్కువ స్థాయిలో ఉన్నాను.

వెంకమ్మగారని ఒకావిడ ఉందండి. అంతా ఆవిడని నా తల్లి అంటారండి. నాకయితే నమ్మకం లేదండి. నా పట్ల ఆవిడ వైఖరిని బట్టి అలా అనుకోవాల్సి వచ్చిందండి. నాతో ఎప్పుడూ, అప్పు వసూలు చేసుకోటానికొచ్చిన అప్పులాడిలా ప్రవర్తిస్తుందండి. ఆవిడ పెద్ద కోడలు, ఇంకా కొంత మంది బంధువులు, ఆవిడని తీసుకొచ్చి నా ఇంట్లో దింపారండి. "చచ్చిపోయిన వాళ్ళింటికెందుకొచ్చావ్? చచ్చిన శవాలని పీక్కు తింటాని కొచ్చావా? అలా పీక్కుతినమని, నీ కొడుకూ కోడలూ చెప్పారా?" అడిగానండి. అలా అడగటానికి కారణం ఉందండి. నేను మిలటరీలో పని చేసేటప్పుడు ఈ వెంకమ్మ నేను, నా భార్య, నా పిల్లలూ చనిపోయారని చెప్పి, నా సంతకం లేకుండా, నా అనుమతి లేకుండా, పొలం అమ్మి ఇల్లమ్మి ఆ డబ్బు తన పెద్ద కొడుక్కిచ్చింది. తర్వాత నేనడిగితే, "విల్లు మార్చాము, అంతా వాడికే, నీ కేం లేదు. నేను కూడా సంతకం పెట్టలేదు. వాడే సంతకం పెట్టి అమ్ముకున్నాడు". అంది రుసరుసలాడుతూ. రెట్టించి అడిగితే యదార్థం బయటపెట్టింది. ఇంకా పైగా "నేనబద్ధమాడితే ఏవయింది. మీరు చావలేదు గదా! బతికే ఉన్నారుగా! నువ్వు అబద్ధాలాడవు కాబోలు! సత్యహరిశ్చంద్రుడివి" అంది తలబిరుసుగా. నేను ఆవిడమీద పోలీస్ రిపోర్టివ్వలేదు. కొన్నవాడి మీద దావా వెయ్యలేదు. ఇంకా పైగా నే పుట్టినప్పటి నుండి, నా తిండికి, గుడ్డలకి, చదువుకి అయిన ఖర్చు లెక్క చూసి ఆవిడకిచ్చి, "నువ్వు నా తల్లివీ కాదు, నేను నీ కొడుకునీ కాదు, ఇక మీదట నీ కొకడే కొడుకు. మీతో ఈ క్షణం నుంచే తెగతెంపులు చేసుకుంటున్నాను. ఇక మీదట నీముఖం నాకు చూపించకు." అని వాళ్లతో తెగతెంపులు చేసుకున్నాను. అయినా, 'చచ్చిన వాడి పెళ్ళికి వచ్చిందే కట్నం' అని ఇంకా నా దగ్గర గుంజాలని, మళ్ళీ మా ఇంటి కొచ్చింది.

"నా కొడుకూ కోడలూ పొమ్మంటున్నారు. అందుకని వచ్చా" అంది వెంకమ్మ రాజమాతలా. ఇంతలో ఆవిడ కోడలు జోక్యం కలుగచేసుకుని, "నువ్వు డబ్బిస్తే చాలదు. మేం పెట్టిన తిండి తిరిగిచ్చేయ్, ఏ విస్తళ్లలో పెట్టామో ఆ విస్తళ్లతో సహా" అంది.

ఇంకో బంధువు, "మీరంతా చనిపోయారని ఆవిడ పొలం అమ్మటం, చాలా స్వల్ప విషయం. అవి పట్టించుకోకూడదు. పెద్దది, మీరావిడని చూడకపోతే మంచిదికాదు. నీ కొడుకు జబ్బుతో మంచం మీదవున్నాడు. ఆలోచించుకోండి" అంటూ బెదిరించింది.

ఇంకో ఆవిడ, "మీ అమ్మ, మీరు చనిపోయారని పొలం అమ్మిందంటే, అది నీ తప్పు, ఆమె తప్పు కాదు" అంది మీద మీదకొస్తూ.

ఇంకో వీరవనిత, "మీరంతా చనిపోతారని అలా అబద్ధం చెప్పింది. అలా ఆవిడ అబద్ధం చెప్పబట్టే మీరింకా బతికున్నారు. లేకపోతే ఎప్పుడో చచ్చేవాళ్ళు" అంది గుంటనక్కలా.

వెంకమ్మ కోడలు చెప్పేది, ఏ న్యాయశాస్త్రంలోనూ లేదు. "నా పొట్ట చీల్చి, మీరు పెట్టిన తిండి, విస్తళ్లు దొరుకుతాయేమో చూసుకోండి" అన్నాను. ఇంతకు ముందు నా బావమరిది ఇంటి మీద కెళ్లడం, అక్కడ పోట్లాట. నానా యాగీ చేశారు. సూక్ష్మంగా చెప్పాలంటే తోడేలు - మేక' కథలో నన్ను మేకని చేశారు. ఈ వెంకమ్మ అనబడే నా తల్లి కొడుకుతోనూ, కోడలితోనూ చేరి, నిష్కారణంగా నన్ను నీచమైన భాషలో తిట్టారు. చిన్నప్పుడయితే నిష్కారణంగా ఇంట్లోంచి వెళ్లగొట్టారు. కుక్కపాట్లుపడ్డాను. ఆమె కొడుకు పెద్ద లౌక్యుడు. అతను పెళ్లాంచేత నాకు ఛండాలపు ఉత్తరాలు రాయిస్తాడు. పెళ్లాన్ని నా ఇంటికి, నా బావమరిదింటికి పోట్లాడమని పంపిస్తాడు. నేను యథార్థాలు రాసినా, పది రోజులలో పునః క్షమాపణ పత్రం పంపించు, లేకపోతే నీ మీద సివిల్, క్రిమినల్ దావా వేస్తాము" అని నోటీసులు పంపుతాడు. "మేం ఏం చేసినా, నోరుమూసుకు పడుండు. నోరెత్తితే నల్లుల్ని నలిపినట్టు నలిపేస్తాము" అదండీ, వాళ్ల దౌర్జన్య వైఖరి. నడి రోడ్డుమీద, నిష్కారణంగా, అప్పులాళ్లలాగ నన్నునిలేశారండి.

వెంకమ్మ మా ఇంట్లోనే ఉంది. ఆమెతో మేమెవరం మాట్లాడం. వేళకి మేం తినేదే పెడతాం. మందులు కావాలంటే ఇస్తాము. మంచి అనుభవం గల్గిన లాయర్‌ని సంప్రదించాను. విషయాలన్నీ వివరంగా చెప్పాను. ఆయన, "నువ్వు వెంకమ్మ కొడుకువి కాదు. ఏ కోటేశ్వరుల ఇంట్లోనో పుడితే, వెంకమ్మ, వెంకమ్మ మొగుడు నిన్ను దొంగించుకొచ్చి, నీ స్థానంలో వాళ్ల బిడ్డని పెట్టారు. డబ్బుకోసం. వాళ్లకి డబ్బురాదు, కానీ వాళ్లబిడ్డ సిరిసంపదల్లో తులతూగుతాడు. వాడి భవిష్యత్తుకేమీ ఢోకాలేదు. నువ్వు చెప్పిన దానిని బట్టి, నీవు పుట్టినప్పుడు, వెంకమ్మగారి ఆర్థిక స్థితి ఏ మాత్రం బాగాలేదు. వాళ్ల బిడ్డ పుట్టినపుడే, నువ్వూ పుట్టావు. ఇది తిరుగులేని సత్యం. మీరు, ఈ ఊరు విడిచి దూరంగా వెళ్లిపోండి. నీ తల్లిదండ్రులెవరో తెలుసుకోవడం, గడ్డివాములో సూది కోసం వెతికి నట్టే అని సలహా ఇచ్చారు.

నా పరిస్థితులు వివరించి, నాకు అండమాన్‌లో భూమి, ఇంటి స్థలం ఇప్పించమని అర్థిస్తూ అధికారులకు అర్జీలు పెట్టుకున్నాను. వెంకమ్మ గారు చనిపోయింది. ఆమె పెద్ద కొడుకు, "ఎంత డబ్బయినా ఖర్చు పెట్టి ఆమె దహన క్రియలు ఘనంగా చేస్తాను. ఆవిడ అస్థికలు, కాశీలో, గంగలో కలుపుతాను" అంటూ ముందుకొచ్చాడు. ఆవిడ కోడలు దొంగ ఏడుపు ఏడ్చి. శవం ఇంకా ఇంట్లో ఉండగానే, ఆవిడ నంచీలు వెతుక్కుని వెళ్ళిపోయింది. నాకు నవ్వొచ్చింది. బతికున్నప్పుడు పిడికెడు మెతుకులు పెట్టడానికి ఏడ్చి, మంచంలో పడితే చాకిరీ చేయాల్సొస్తుందని వాళ్ళింట్లోనే చస్తే, ఇల్లు పాడుపెట్టుకోవాలని, నా ఇంటికి వెళ్లగొట్టి, ఇప్పుడు ఎంత ఉదారంగా మాట్లాడుతున్నాడో గదా? ఎవయినా వాళ్ళు బలవంతులు, లక్షాధికారులు 'ఇంకా చెప్పాలంటే దేవతలు. వాళ్ళకి చావులేదు. అందుకే వెంకమ్మగారు వాళ్ళింట్లో చస్తుందేమోనని నా ఇంటికి పంపారు. ఒక అనాథగా, ముష్టి దానిగా భావించి, నేను కూడా కర్మ చేశాను.

స్థలం ఇస్తారేమోనని ఎదురు చూస్తూ ఉన్నాను. వూరొదిలిపోవడానికి.

వాళ్ళ బంధువులంతా, వెంకమ్మ, వెంకమ్మ కొడుకూ, కోడలీ, చాలా 'పెద్ద వాళ్లు' అన్నారు. నన్ను మాత్రం "ఏవన్న మనిషి వాడు. తల్లిని ఎందుకొచ్చావన్నాడు. ఇటువంటి వాళ్లుకూడా వుంటారా!? వాడు పెద్దవాళ్ల జాబితాలోకి చేరడు. పెద్ద మనిషి కాడు" అన్నారు. కానీ సంఘం మాత్రం నేనే పెద్ద మనిషినంది. ఈ కథలో పెద్దగా శిల్పం లేదు. ఎందుకంటే వెంకమ్మగారు, శవంగా మార్చిన నా కథ చచ్చిపోయినవాడి కథ. చచ్చిపోయినవాడి కథకి శిల్పం లోపించినా పర్వాలేదని నేననుకుంటున్నాను. మీరే చెప్పండి! ఎవరు పెద్ద మనిషి?

●

ఓ కవి మిత్రుడు హరిని కలిసి "నేనో కవిత చెబుతా వింటావా" అనడిగాడు. "వింటానుగానీ ఒక షరతు! చెప్పిందే చెప్పకూడదు. త్వరగా ముగించాలి" వినుగ్గా చెప్పాడు హరి.

లక్కరాజు ప్రఫుల్లచంద్ర
ధర్మవరం